# దుఃఖిత ప్రణయిని

"మూర్తిశ్రీ"

మధూ!

నమస్కారములు యిలాగు ఉత్తరం మొదలెట్టగానే ఎవరో అనుకుంటున్నావు కదూ. అవును మరి మర్చిపోయి ఉంటావు. యిప్పటికైనా జ్ఞాపకానికి వచ్చానా లేదా? మధూ నా హృదయంలో శాంతిలేని తుఫాను బయలుదేరింది ఆ హృదయ తుఫానుకి మరి అంతులేదు. ఎన్నో కథలు వ్రాసేవు ఎన్నో కథలు చదివావు. యిలాగు ఏ వ్యక్తి అయినా చేసినట్లు చదివావా?

చిన్నప్పటినుంచి యిరువురం ఒకే భావాలతో ఒకే దగ్గిర పెరిగాము కాని మన మనోభావాలు కలిపినట్లే మనల్ని కూడా కలపలేకపోయింది విధి ఏంచేస్తాం? జరిగిన దానంతటికిని 'కర్మ' అని ఒక పదంతో సరిపెట్టుకో మంటావో లేక ధైర్యంగా యీ సమాజాన్ని ఎదిరించమంటావో! ఈ సమాజాన్ని ఎదిరించలేను మధూ! సమాజం స్వార్థపూరితమైనది. పురుషుడికి సర్వస్వతంత్రం యిచ్చి స్త్రీపైన నిరంకుశాధికారం చెలాయించమని ఆజ్ఞయిచ్చింది పురుషుడేపని చేసినా ఎంత పాపపుపనిచేసినా సమాజం చిరునవ్వునవ్వి ఊరుకుంటుంది. కాని స్త్రీ ఎంత చిన్నతప్పు చేసినా ఆమెను శిక్షిస్తుంది. ఆమె అందరిదృష్టిలో హేయంగా కనిపిస్తుంది. కాని స్త్రీ గొప్పతనాన్ని అర్థంచేసుకున్న వాడొక్కడు లేడీ సమాజములో పురుషుడు ఏపనైనా చేస్తే "పొరపాటు" అంటుంది. అదే స్త్రీ అయితే "పరిపాటు" అంటుంది. నా హృదయంలో ఆవేదన నీకర్థంకాదు. నే పడుతున్నబాధని నీవు అవగాహన చేసుకోలేవు "వివాహితవైన స్త్రీక యిదిబాగులేదు" అంటావు కదూ? నాకుతెల్సు. కానీ యీ ప్రపంచంలో నన్ను అర్థంచేసుకునేటందుకు ప్రయత్నించే వారెవరైనా ఉన్నారంటె ఆవ్యక్తి నాదృష్టిలో నీవే అందుకే నావిషాదమైనగాథ నంతటినీ నీముందు చెబుతున్నాను...

నీకు తెల్సు ఆరోజులు మన యిద్దరికే వివాహము చేద్దామనుకుంటున్న రోజులు. ఆ రోజు మానాన్నగారు నాదగ్గరకొచ్చి "మధూని పెండ్లాడడానికి యిష్టమేనా భారతీ" అన్నారు, సిగ్గుతో తలవంచి ఊఁకొట్టాను. నిన్నూ యిలాంటి ప్రశ్న మీనాన్నగారు అడిగేరని మర్నాడు చెప్పావు. నీవూ ఒప్పుకున్నట్లు కూడా చెప్పావు సరే అంతా సిద్ధమైంది యింతలో వచ్చాడు మా మామయ్య. యింట్లో ప్రయత్నాలు చూచి నాన్నని, అమ్మని కారణం అడిగేడు. అమ్మ సంబరంతో చెప్పింది పెళ్ళికొడుకు నువ్వు అని తెలియగానే మామయ్య మండిపడి "ఆ గర్భదరిద్రుడికి పిల్లనిచ్చి దాని గొంతుకోస్తావా" అన్నాడు. మా అమ్మ "అది కాదురా తమ్ముడూ! పిల్లాడు బాగుంటాడు, బుద్ధిమంతుడు ఈ సంవత్సరంతో బి. ఏ. అయిపోతుందికదా?" అన్నది. "అందం కొరుక్కుతింటారా? అందంగా లేనిభర్తతో ఎవరూ కాపురం చేసి పిల్లల్ని కనలేదా? యింతెందుకు? బావ ఎంత అందమయినవాడని నువ్వు పెళ్లాడేవు? సంసారం చెయ్యలేదా?"

"ఈనాటిపెళ్ళిళ్ల వేరురా నాతండ్రి" అన్నది అమ్మ మామ ససేమిరా అన్నాడు. నాన్నగారు యీ విషయంగురించి ఆలోచించుతా నన్నారు. మా నాన్నగార్కి, అమ్మకుకూడా నన్ను నీకివ్వాలనే వున్నాది. కాని మా మామయ్య పాతాళభైరవుడులాగ ఒచ్చి కాదన్నాడు పెళ్లి. కాని నాన్నగారు ఆఖరికి మామచెప్పినదానికి ఎదురుతిరిగి నన్ను నీకేఇస్తామన్నారు. దానితో మామయ్య ఊరుకొని భోజనాలయిన తర్వాత పేచీపెట్టాడు.

"బావా సరేకాని నాడబ్బు మాటేమిటి అంటావు?"

"పెళ్ళి ఒడుదుడుకులుతీరగానే యిచ్చేస్తాను."

"నాకవసరంగా వుంది బావా?"

"యీ తప్పుకు కాయమని ప్రార్థిస్తున్నాను" అన్నారు.

"బావా నీచెవిని ఒక్కమాట వేస్తాను వింటావా?"

"చెప్పవోయ్"

"నేనయినా చిన్నవాడిని కానూ? వయస్సు ఏమీ పెద్దచెప్పుకోదగ్గది కాదు. మొన్ననే నలభై తొమ్మిది వెళ్లాయి మీచెల్లెలు చనిపోయి ఆరేళ్ళయింది. దాని బంగారం చాలావున్నది. నాఆస్థి నీకు తెల్సుకదా? అరవై ఎకరాల పల్లం వున్నది... యిరవై వేలు నగదు వున్నది, మీ భారతిని నాకు కట్టబెట్టు.. ..."

నాన్నగారు నిరుత్తరులు అయారు. చూస్తూ ఎలాగ పద్దెనిమిది సంవాదనలు జరిపి, పద్ధెనిమిది సంవత్సరాల పిల్లని ఏబది సంవత్సరాల వాడికి ఇస్తారు "లాభం లే"దన్నారు.

"అబ్బ! అయితే ..ఈ క్షణంలో నారెండు వేల రూపాయలు .యియ్యి? . లేదా నేచెప్పిన దానికి ఒప్పు"

తర్వాత నాన్నగారు ఎంతోసేపు అమ్మతో ఆలోచించి ఆఖరుకి నన్ను మామయ్యకిచ్చి పెళ్ళి చేయడానికి ఒప్పుకున్నారు. ఒక మంచిముహూర్తంలో మామయ్య నా మెడకు పుస్తెకట్టాడు. అత్తవారింటికి వెళ్లాను. సుఖమనేది లేదు. మా మామయ్య కాలు కదపనీయడు నన్ను ... కాని నా యవ్వనమంతా నా సౌందర్యమంతా .. అడవినకాసిన వెన్నెల కానీ సంఘం నన్ను "కర్మ"అని "పూర్వజన్మపు పాప"మని కట్టబడేసింది. కాని నాలోనికోర్కెలు కట్టపడేయ లేదే ఈ దుర్మార్గపు సమాజం. నాతల్లి తండ్రులు .. నాజీవిత పుష్పాన్ని తమచేతులతోనే నలిపివేశారు. ఏమయినా అంటే 'విధి'అంటారు విధి! క్షణంలో నవ్విస్తుంది క్షణంలో ఏడిపిస్తుంది, వీణనిస్తుంది తీవలు తెంపుతుంది, రాగాన్ని ఆలాపన చేయమంటుంది... గుడ్లు పీకుతుంది ఎదురుగా పెడుతుంది. మనల్ని చూడమంటుంది. అన్నిటికీ చిరునవ్వు నవ్వుతుంది. మధూ ఎన్నటికైనా, నాహృదయం నీది . నేను నీసొత్తు ఎప్పటికైనా నీ దర్శనభాగ్యం లభిస్తుందని స్వాతి వానకి ముత్యపు చిప్పల్లా ఎదురు చూస్తాను.

నీ

'భారతి'

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

**1583**

—మేనేజరు